నాలుగిళ్లల్లో పాచిపని చేసుకునే రంగి చూపులెప్పడూ ఎదురింటి చిన్న పెంకుటింట్లో వుండే మధ్య తరగతి గృహిణి జానకిమీదే. మధ్య తరగతి జానకి చూపులెప్పడూ తనకన్నా కొద్దిగా పై స్థాయిలో వుండే మీనాక్షి యింటివైపే. అయితే మీనాక్షి చూపులెప్పడూ తనకి ఎదురుగా వుండే పెద్ద బంగళావైపే. ఆ బంగళా యిల్లాలు సౌమ్య. ఇంతా చేసి అంత పెద్ద బంగళాలో వుండే సౌమ్య చూపులు మాత్రం తన ఇంటి వెనక చిన్ని గుడిసెలో వుండే రంగి ఇంటి వైపే. విచిత్రంగాలేదూ... అయితే చదివి తెలుసుకోండి మరి.....




## రంగి

ఏటో నా బుద్ధి. తీరిక దొరికినప్పుడల్లా ఆ ఎదురింటి జానకమ్మ యింటి వేపే చూడాలనుంటది. నాలుగిళ్ల పాచిపని చేసుకుంటేగాని పొట్ట నిండని దాన్ని ఆయమ్మలాగుండాలంటే నేనెలాగుండేది! నాకూ వుంది యీ పూరి కొంప సూరిబాబు, చందురుడుబాబు యిద్దరూ మా ఇంట్లోనే కాపురం. కూసింత గాలేస్తే పాక ఎక్కడ కొట్టుకుని పోతాదో అని బెంగ. ఇంక వాన దేముడికి అగ్గరమొచ్చిందంటే వున్న కుండలు, ముంతలు ఎన్ని వరుసగా పేర్చినా కాసింత కాళ్లు డొక్కులో ముడుచుకొని తొంగుందామన్నా సోటు దొరకదు.

ఆ యమ్మది చక్కగా చిన్న పెంకుటిల్లు. అబ్బ... ఎంత ముద్దుగా వుంటుందో. ఆయమ్మకి బొట్టెలు యిద్దరుగామాల. పొద్దుగాలే చక్కగా తయారయి టిఫిని పెట్టెలు, పుస్తకాల సంచులు పట్టుకొని ఒకళ్ళ చెయ్యి

ఒకళ్ళు విడువకుండా రోడ్డు పక్కనుంచి నెమ్మదిగా నడుచుకుంటూ యిస్కూలుకెళుతూ వుంటే చూడ రెండు కళ్ళూ చాలవు.

నాకూ వున్నారు యిద్దరు గుంటెదవలు. కాని యీ స్కూలు పేరెత్తగానే చినిగిన లాగులు పైకెగదోసుకుంటూ పత్తాలేకుండా పారిపోతారు. అయినా ఆల్లననే పనేముంది. ఆ మగాడి కసలు పిల్లలకి నాలుగచ్చరం ముక్కలు నేర్పిద్దామని వుంటేగదా.

ఎంతసేపు ఆ మేస్త్రీల వెంబడిపడి తిరగడం. కూలిపని దొరికిననాడు వళ్ళు వంచి పని చెయ్యడం, ఆ యిచ్చిన కూలి డబ్బులతో పూటుగా తాగి తందనాలాడటం. కూలి దొరకనినాడు మాత్రం తన వెంబడి కుక్కలా తిరిగి తిరిగి తన మీద తెగ ప్రేమ కురిపించి, పనికిమాలిన కబుర్లుచెప్పి పైసో పరకో లంకించుకుపోతాడు. ఏనాడైనా ముచ్చటకేనా ఒక కోకకొని తెచ్చినాడా... మూరెడు మల్లెపూలు తెచ్చినాడా...

జానకమ్మ మొగుడు ఆఫీసుకు సైకిలుమీద బయలుదేరుతూవుంటే ఆయమ్మ పెనిమిటి కనుమరుగయ్యేదాకా చెయ్యి వూపుతూనే వుంటుంది. సాయంకాలం అయిందంటే పిల్లలు, ఆ అయ్య యిల్లు చేరితే ఒకటే సందడి. ఏ పుణ్యం చేసుకుందో ఆ యమ్మ.

నా జన్మ వుంది ఎందుకూ,... ఏ పాపం చేసుకున్నానో ఈ పాడు బతుకిచ్చాడు భగవంతుడు.. ఊ.... పనికివేళయింది. కొంచెం ఆలశ్యమయితే ఆ యమ్మ మూతి మూడు వంకర్లు తిప్పుతాది ఇంక లేస్తా...!

## జానకి

ఏమిటో గానుగెద్దు జీవితం. పొద్దున్నే లేచింది మొదలు వురుకులు, పరుగులు. పిల్లల్ని మంచి కాన్వెంటులో చేర్పిద్దామంటే తిండికే బోటాబోటీ. మనకొచ్చే జీతం అప్పులకే సరిపోతూవుంటే అంతంత ఫీజులు కట్టి మనమెక్కడ చదివిస్తామంటారాయన. అదీ నిజమే. గుమస్తా వుద్యోగానికి చాలీచాలని జీతాలు, పైగా ఆకాశన్నంటే ధరలు, కోరికలుంటే మాత్రం ప్రయోజనం ఏమిటి...

పక్కింటి డాబా యింట్లో వుండే మీనాక్షి ఎంత దర్జాగా వుంటుంది. ఆ ఇల్లు చూస్తూ వుంటేనే ముచ్చట వేస్తుంది. అందమైన డాబా యిల్లు. ఆవిడకి యిద్దరు పిల్లలు కాబోలు. ఆ పిల్లలు యూనిఫారాలు వేసుకొని రిక్షా యెక్కి వెళుతూవుంటే నడుచుకుంటూ యీసురోమని వెళ్లే తన పిల్లలు గుర్తుకొస్తారు. పైగా కాన్వెంటులో చదువుతున్నట్టు వున్నారు. ఇంగ్లీషులోనే మాట్లాడుకొంటూ వుంటారు. ఆ మీనాక్షి మెడలో నల్లపూసల గొలుసు, నానుతాడు, ఇంకేదో ముత్యాల గొలుసులా వుంది. ఎప్పుడూ మెళ్లో వేసుకొంటుంది. ఏ పూర్వ జన్మపాపమో ఒక నగా పాడా.. బోసిమెడలేసుకొని.. ఏ పేరంటానికేనా వెళ్లాలంటే సిగ్గేస్తుంది. ఆ మీనాక్షి ఎంత ఖరీదయిన చీరలు కడుతుందని. తనూ వుంది... ఎందుకూ... ఎప్పుడూ ప్రతిదానికి వెతుక్కోవడమే...పైస పైస చూసి ఖర్చు చెయ్యడమే. ఒక సరదాలేదు పాడూ లేదూ. తెగపోరితే ఎప్పుడో ఒక మారు సినిమాకు బయలుదేరదీస్తారు.

ఆ మీనాక్షయితే రెండు రోజులకోమారు, మూడు రోజులకోమారు దర్జాగా భర్త స్కూటరు మీద కూర్చొని ఎటో చెక్కేస్తూ వుంటుంది. అప్పుడప్పుడు పిల్లలతో సహా... మనకి మాత్రం కోరికలుండవా...కాని ఎవరితో చెప్పుకోను.

అప్పుడప్పుడు తనవైపు ఎంత గర్వంగా చూస్తుంది. తనకే బోడి యిల్లు..సంసారం వుందని.

ఇంతకీ ఎవర్నని ఏం ప్రయోజనం...తను యింతేపెట్టి పుట్టింది. పిల్లలు వచ్చే వేళయింది...ఆలోచనలకి ఫుల్‌స్టాప్ పెట్టి పనిలో చొరబడాలి.


## మీనాక్షి

ఎప్పటినుంచో యీయనతో పోరుతున్నా. ఆ ఎదురింటి సౌజన్యవాళ్ల బంగాళాలాంటిది కట్టుకొందామని. అబ్బ ఏం ఫోజుకొడుతోంది. తనకే యింత సంపదుందని. పలకరించినా సరిగ్గా మాట్లాడనే మాట్లాడదు. ఇంట్లో కూడా ఐదువేలకి తక్కువ ఖరీదుగల చీర కట్టనేకట్టదు. మెడనిండా నగలు దిగేసుకొని నాకే వున్నాయి సుమా అని ప్రదర్శించుకొంటూ వుంటుంది. ఆవిడకొక కారట. ఆయనకొక కారట. అయినా ఆవిడెప్పుడూ ఎక్కడికి వంటరిగా వెళ్లినట్టు కనిపించదు. ఇద్దరో ముగ్గురో పిల్లలట. వూటిలో చదువుతున్నారట. ఒకమారు తను అడిగితే ఊటీలో చదువుతున్నారని ఎంత గర్వంగా చెప్పింది. పిల్లలిక్కడ వుండరు. ఇంటినిండా పని మనుషులే... యింకేం. అతనేం బిజినెస్ చేస్తాడో ఏమో కాని చాలా దర్జాగా వుంటాడు.



### పాపం ఎంత కష్టం!

సన్నబడేందుకు లారాదత్తా ఇప్పుడు తెగ కృషి చేస్తోందిట. అక్షయ్‌కుమార్‌తో కలిసి ఆమె 'బ్లూ' అనే సినిమాలో నటిస్తోంది. ఇందులో నాజూగ్గా కనిపించడానికి బరువు తగ్గే ప్రయత్నాలు జోరుగా చేస్తోందిట. ఈ సినిమాలో ఆమె టూ పీస్ బికినీలో కూడా కనిపించవచ్చునంటున్నారు బాలీవుడ్ జనాలు. క్రేజ్ సంపాదించుకోడానికి ఎన్నెన్నో పాట్లు మరి!



ఎప్పుడూ ఏవో పార్టీలు, గెట్ టు గెదర్‌లు అంటూ భార్యని వెంబడేసుకొని తిరుగుతూ వుంటాడు. వాళ్లింట్లో పెద్ద గార్డెన్ వుంది. ఎన్ని రకాల గులాబీలు, ఎన్ని రకాల పూలు...అక్కడ తోటమాలి పనిచేసే వీరన్న ద్వారానే కొన్ని కొన్ని సంగతులు తెలుస్తాయి. ఆవిడెప్పుడూ పైన కనిపించనే కనిపించదు.. కనిపించినా అడిగినదానికే తప్పదన్నట్టు సమాధానం చెప్పి లోపలికెళ్లిపోతుంది.

దేనికైనా పెట్టి పుట్టాలి. వారానికో, పది రోజులకో ఒక సినిమా..లేకపోతే ఏ ఫ్రెండ్సింటికో పుట్టినరోజులనో, పెళ్లి రోజులనో ఫంక్షన్లకటెండవటం.. ఇంతే.. అదైనా స్కూటరు మీద.

ఇప్పుడు లక్ష రూపాయలకే కారొస్తోందట. అది కొనుక్కుందామండీ అంటే వేదాంతిలా ఒక చిరునవ్వు నవ్వి 'ఏం ఈ బండి మన హోదాకి సరిపోలేదా' అంటారు. అటువంటి వాళ్లతో ఏం మాట్లాడతాం.. సరే నా సోదితో విసిగించానేమో..పిల్లలొచ్చే వేళయింది. వంట చెయ్యాలి. టా..టా...

## సౌజన్య

ఏమిటో బంగారం పంజరంలో బంధించిన పక్షిలా వుంది నా బ్రతుకు. గట్టిగా నవ్వుకోకూడదు. గట్టిగా ఏడవకూడదు. మనస్థాయికి తగని వాళ్లతో మనసు విప్పి మాట్లాడకూడదు. పనివాళ్లతోటి, యిరుగుపొరుగు వారితోటి మాట్లాడాలని వుంటుంది. కాని ఎప్పుడూ స్టేటస్ స్టేటస్ అంటూ వుంటారు ఆయన. పోనీ ఆయన లేనప్పుడేనా మనస్సు విప్పి ఎవరితోనైనా మాట్లాడదామంటే ఎవరూ చేరవేస్తారో తెలీదు కాని విషయం మాత్రం ఆయనకు చేరిపోతుంది. దాంతో విసుర్లు, కసుర్లు పైగా కనకపు సింహాసనమున అని దెప్పి పొడుస్తూ వుంటారు. నేనేమైనా ఈ ఆస్థి, అంతస్తు ఎప్పుడైనా కోరుకుందా...తన అందం చూసి వెంటపడి మరీ పెళ్లాడారు.

కాని ఏం ప్రయోజనం. భార్యాభర్తల మధ్య వుండవలసిన అనురాగం ఆప్యాయత తమకేవీ...ఎప్పుడైనా పది నిముషాలు తన దగ్గర కూర్చుని ప్రేమతో మాట్లాడారా. ఎంతసేపు బిజినెస్, బిజినెస్. లాభాలు..నష్టాలు...యింకా పైకి రావాలంటే ఎవర్ని ముంచాలి యిదే ఆలోచనలు. ఏ పార్టీలకెళ్లినా యివే మాటలు. అతని వెంబడితను ఒక స్టేటస్ సింబల్‌గా మాత్రమే వెళుతుంది. ఇదేనా జీవితమంటే పోనీ పిల్లలనైనా ఆప్యాయంగా పెంచుదామంటే, వాళ్ల ఆటపాటలతో మురిసిపోదామంటే ససేమిరా వీల్లేదని వాళ్లని తీసుకెళ్లి ఊటీలో పెట్టారు. మీ పిల్లలెక్కడ చదువుతున్నారంటే - ఊటీలో అని చెప్పుకుంటే అదొక గొప్పట.

ఏ టూరు వెళ్లినా వేలకి వేలు పోసి చీరెలు, నగలు తెచ్చి పడేస్తారు. పార్టీలకెళ్లినప్పుడు పెట్టిన నగ పెట్టక, కట్టిన చీర కట్టక తనొక పెద్ద షోకేసులో బొమ్మలా అయిపోతుందక్కడ. అదొక గొప్ప సంతోషం ఆయనకి.

ఇంట్లో వున్నంతసేపు టి.వి. లేకపోతే డి.వి.డి. వీటితో కాలక్షేపం చెయ్యమంటారు. ఎంతకని లైఫ్ బోరు కొడుతోంది. ఏ పని చేద్దామని వున్నా ఇంటి నిండా పని మనుషులే. ఆప్యాయంగా మాట్లాడే మనిషే కరువవుతోంది. దీనికన్నా జైలు జీవితమే నయమేమో.

ఎప్పుడైనా తోచక టెర్రాస్‌మీద నిలబడితే ఆపాక వైపే చూడబుద్ధి. వంట మనిషి రంగమ్మని ఒకసారి ఆ పాక ఎవరిదని అడిగితే నాతో మాట్లాడటానికే భయపడుతూ పనిమనిషి రంగిదని మాత్రం చెప్పిపోయింది. ఆ యింటిని చూస్తే ఎంత ముచ్చటేస్తుంది. ఆ స్వేచ్ఛా జీవితం, ఏ వేళప్పుడు ఎక్కడికైనా స్వేచ్ఛగా వెళ్లగలిగే స్వతంత్రం.. గంజి అన్నమైనా తన పిల్లలకి ఎంత ఆప్యాయంగా తినిపిస్తుంది. అప్పుడు ఆ తల్లి పిల్లల మొఖాల్లో కనిపించే ఆనందం ఎన్ని కోట్లు పెట్టి కొనుక్కుంటే దొరుకుతుంది.

తనకెప్పటికైనా అలాంటి అదృష్టం లభిస్తుందా...ఏమో కాలమే చెప్పాలి..

వెన్నెల రాత్రుళ్లలో ఆరుబయట మంచాలేసుకొని ఆ భార్యాభర్తలు, పిల్లలు ఏం ముచ్చట్లు చెప్పుకొంటారో కాని నవ్వుతూ, అరుపులు, కేకలు, పెద్దవాళ్ల మందలింపులు.. అబ్బ ఆ దృశ్యం ఎంత మధురంగా వుంటుంది.

నగలు, నాణాలు అందమైన భవంతులు లేకపోవచ్చుగాక కాని స్వేచ్ఛా జీవితం వాళ్లది. ఏ జన్మలో తను చేసుకున్న పాపమో యిది. యీ బంగారు పంజరంలో తన బ్రతుకు వెళ్లవలసిందే.

కనీసం యిద్దరు కలిసి పది నిముషాలు ఆనందంగా మాట్లాడుకొనే అవకాశమే లేదు. ఏ అర్ధరాత్రో వచ్చి తన అవసరం తీర్చుకోవడం వరకే. యిలాంటి జీవితం పగవాళ్లకి కూడా వద్దు బాబు. వచ్చే జన్మలోనైనా దేముడు ఆ రంగిలాగా పుట్టిస్తే తన జన్మధన్యమైనట్టే.

ఇదండీ...తిరిగి తిరిగి మళ్ళీ రంగి దగ్గరకేవచ్చి ఆగిపోయాం.

★

## వింతలు...విడ్డూరాలు

★ 1974-76 సంవత్సరాల కాలంలో తైవాన్‌లో ఒక యువకుడు ఒక అమ్మాయిని ప్రేమించాడు! అవును మరి! అందులో వింత ఏముంది? కాని ఆయన చేసిన ఘనకార్యమేమిటంటే ఆ అమ్మాయికి 700 ప్రేమలేఖల్ని రాయడం! ఇదీ వింతగా తోచకపోవచ్చు! ఆ అమ్మాయి పెళ్లిచేసుకుందండోయ్.. ఐతే వింతా? కానేకాదు. కాని ఆమె ఆ యువకుణ్ణి పెళ్లాడలేదు! మరెవర్నో ప్రేమించిందనుకుంటున్నారా? ఐతే కావచ్చు కానీ.. ఆమె పెళ్ళాడింది ఆ ప్రేమలేఖల్ని మోసుకొచ్చిన 'పోస్ట్‌మాన్'ని మరి!

★ మామూలుగా పిల్లల్ని కనే జంతువులే తమ పిల్లలకి పాలిచ్చి పోషిస్తాయి. గుడ్లుపెట్టి పొదిగి పిల్లల్ని చేసే ప్రాణులు పాలివ్వవని మనకు తెలుసు. అని ఆస్ట్రేలియాలోని 'ప్లాటిపస్' అనే ప్రాణి పక్షుల్లాగా గుడ్లుపెట్టి పొదిగి పిల్లల్ని చేయడమే కాకుండా జంతువుల్లాగా తన పిల్లలకి పాలిచ్చి పోషిస్తుంది.

★ మొట్టమొదట ఈ భూప్రపంచంలో వీలునామా వ్రాసిన వ్యక్తిగా సిసిలీ దేశపురాజు 'రోజర్' పేరు తెచ్చుకున్నాడు. ఆయన క్రీ.శ. 1102లో వీలునామా రాశాడు. ఆ తర్వాతగానీ ఈ పద్ధతి నెమ్మది నెమ్మదిగా ప్రపంచవ్యాప్తం కాలేదు.

★ 'ఆక్టోపస్' అనే సముద్రపు చేప దూరానికి తగినట్లుగా 'బైనాక్యులర్స్' మాదిరిగా దృష్టిని సరిచేసుకునే శక్తిని కలిగి వుంది.

-జయసౌజన్యామూర్తి

